క్లుప్తంగా

నేడు వీరభద్రేశ్వరస్వామి జాతర

తాండూరు రూరల్: మండల పరిధిలో వీరారెడ్డిపల్లిలో శ్రీ వీరభద్రేశ్వరస్వామి జాతర బుధవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం శివపార్వతుల కల్యాణం, సాయంత్రం రథోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. కావున భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

కోట్‌పల్లిలో భగీరథ మహర్షి జయంతి



కార్యక్రమంలో పాల్గొన్న సగర సంఘం నాయకులు

బంట్వారం: భగీరథ మహర్షి జయంతిని మంగళవారం కోట్‌పల్లి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఆ మహనీయుడి కఠోర దీక్షను గుర్తు చేశారు. కార్యక్రమంలో సగర సంఘం నాయకులు మహేందర్, నర్సింలు, రమేష్, వెంకటేశం, నారాయణ, యాదప్ప, కృష్ణ, రాములు, పాండు, లోకేష్, నరేందర్, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

కొడంగల్: పట్టణ లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం సాయంత్రం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లయన్స్ క్లబ్ ఫౌండర్, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి సమక్షంలో కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా మురహరి వశిష్ట, కార్యదర్శిగా శివకుమార్ గుప్తా, కోశాధికారిగా వెంకట్‌రెడ్డి, మెంబర్‌షిప్ కమిటీ చైర్మన్‌గా ముద్దప్ప దేశ్‌ముఖ్, ఉపాధ్యక్షుడిగా ఏన్గుల భాస్కర్, చారి, జాయింట్ సెక్రటరీగా శ్రీనివాస్ గౌడ్‌లను ఎన్నుకున్నారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం



నగదు అందిస్తున్న స్వామి, నాయకులు

కుల్కచర్ల: బడుగు బలహీనవర్గాలకు తాము అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం నాయకుడు కుమ్మరి స్వామి అన్నారు. మండలంలోని బండవెల్కిచర్ల గ్రామ పరిధిలో కుమ్మరి కిష్టయ్య ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నేత స్వామి మంగళవారం బాధిత కుటుంబీకులను పరామర్శించారు. ఈ మేరకు రూ.10వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో తిర్మలాపూర్ ఎంపీటీసీ రాంలాల్, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, వినోద్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌కు చేరిన ఈవీఎంలు




స్ట్రాంగ్ రూం దగ్గర ఉన్నతాధికారులు

కొడంగల్: పాలమూరు పార్లమెంట్ స్థానంలో పోటీ చేసిన అభ్యర్థుల భవితవ్యం స్ట్రాంగ్ రూమ్‌లో భద్రంగా ఉంది. కొడంగల్ నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు చెందిన ఈవీఎంలను మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పాలమూరు యూనివర్సిటీ లైబ్రరీ భవనంలోని స్ట్రాంగ్ రూమ్‌లో ఈవీఎంలను ఉంచారు. జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, కొడంగల్ తహసీల్దార్ విజయ్‌కుమార్, స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో ఓటింగ్ యంత్రాలకు సీల్ వేసి భద్రపరిచారు.

చిన్నారి మృతి బాధాకరం

ఆర్పీఎల్ సీఈఓ శ్రీనివాస్‌రెడ్డి



బాధిత తల్లిదండ్రులకు నగదు అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

తాండూరు రూరల్: కుక్కదాడి బాలుడు సాయినాథ్ మృతి చెందడం తనను ఎంతో బాధకలిగించిందని ఆర్పీఎల్ సీఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం తాండూరు పట్టణంలోని జిల్లా ఆస్పత్రి వద్ద బాలుడి తల్లిదండ్రులకు రూ.10 వేలు అందజేశారు. వీధికుక్కలను అరికట్టాలని మున్సిపల్ అధికారులను కోరుతానని చెప్పారు. కార్యక్రమంలో కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి ఉన్నారు.

డబుల్ ఓట్ల గండం

- పోలింగ్ శాతంపై తీవ్ర ప్రభావం
- రెండేసి ఓట్లను తొలిగించాలంటున్న గ్రామీణవాసులు



ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేసిన ఓటర్లు

మోమిన్‌పేట: సాంకేతికయుగంలో సైతం ఓటరు జాబితాలో తప్పులు దొర్లుతున్నాయి. ఇటీవల జరిగిన లోక్‌సభ పోరులో డబుల్ ఓట్లను తొలగించాలని పలువురు ఎన్నికల సంఘాన్ని కోరుతున్నారు. గ్రామాలలో, పట్టణాలలోని ఓటరు జాబితాలో రెండేసి ఆపై ఉన్న ఓటర్లను తొలగించాల్సిన అవసరం ఉందని నొక్కి చెబుతున్నారు. పల్లెల్లో పోలింగ్ పెరుగుతున్నా, పట్టణాల్లో తగ్గడంపై సర్వత్రా విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు జరిగినప్పుడల్లా పట్టణాలు ఖాళీ అవుతున్నాయి. పల్లెల్లో మాత్రం ఓటింగ్ శాతం పెరుగుతుంది. అంటే ఓటర్లు పల్లెలకు రావడంతో పట్టణాల్లో ఓటింగ్ శాతం తగ్గుముఖం పడుతుంది. భారత ఎన్నికల సంఘం ఓటు హక్కును తమ బాధ్యతగా గుర్తించి వినియోగించుకోవాలని అవగాహన కల్పిస్తున్నా చాలా చోట్ల ఆశించిన ఫలితం ఉండటం లేదు.

రెండు ప్రాంతాల్లో..

ఓటరుగా కొన్ని కుటుంబాలు రెండు, మూడు ప్రాంతాలలో ఓటు నమోదు చేసుకుంటున్నాయి. ఒకరికి ఒక చోట మాత్రమే ఓటు వేసేలా అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో వివిధ ప్రాంతాల్లో ఓటు నమోదుకు చేసుకోవడానికి ప్రజలు ఉత్సాహం చూపుతున్నారు. కొన్ని కుటుంబాలు సొంత గ్రామంలో, సమీప పట్టణంలో నివాసముంటే అక్కడ, హైదరాబాద్‌లో ఉద్యోగ రీత్యా నివాసముంటే అక్కడ ఓటర్లుగా దరఖాస్తు చేసుకుంటున్నారు. దీంతో ఓటర్ల సంఖ్య భారీగా పెరుగుతోంది. స్థానిక సంస్థల ఎన్నికలలో అభ్యర్థుల భవితవ్యాన్ని బయటి ఓటరులే నిర్ణయిస్తున్నారు. ఒక్కో ఓటు గెలుపునకు కీలకం కావడంతో ఓటర్లను మచ్చిక చేసుకొని రవాణా, భోజనం ఇతర ఖర్చులను భరిస్తున్నారు. చాలా మంది ఓటర్లు స్థానిక సంస్థలు, మున్సిపాలిటీల ఎన్నికల కోసం రెండు ప్రాంతాలలో ఓటును నమోదు చేసుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

ఆధార్‌తో చెక్

ఆధార్‌కు ఓటును అనుసంధానం చేయాలని ఒకరికి ఒకే చోట ఒకే ఓటు ఉండాలని మేధావివర్గం చాలా రోజులుగా పేర్కొంటోంది. ఆధార్‌లో ఉన్న చిరునామా ప్రకారం ఓటును నమోదు చేసుకొనేందుకు అవకాశం ఉండాలని కోరుతున్నారు. అలా ఉంటే స్థానిక సంస్థల ఎన్నికలలో అభ్యర్థుల ఖర్చులు, సమయం తగ్గుతుందని పలువురు గ్రామస్తులు పేర్కొంటున్నారు. రెండు ప్రాంతాలలోని ఓటరు జాబితాల్లో పేర్లు ఉండటంతో ఎక్కువగా ఓటర్లు ఉన్నట్లు రికార్డులో కన్పిస్తుంది. దీని ప్రభావం పోలింగ్ శాతంపై పడుతుంది. ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ విషయమై ఎన్నికల అధికారులతో చర్చించి ఆధార్‌కు అనుసంధానం చేయాలని కోరాలని కోరుతున్నారు.

కంకర తేలి.. దుమ్ము కప్పేసి

ఇదీ వికారాబాద్–సదాశివపేట రోడ్డు దుస్థితి

మోమిన్‌పేట: వికారాబాద్ నుంచి సదాశివపేటకు వెళ్లే రహదారి మధ్యలో వెల్‌చాల్ నుంచి రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారి రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగిస్తోంది. ఈ మేరకు గడిచిన మూడు సంవత్సరాలుగా వాహనాదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కిలో మీటరన్నర పూర్తిగా రాళ్లు తేలి పెద్ద గోతులు ఏర్పడ్డాయి. కనీసం మరమ్మతులు సైతం అధికారులు చేయడం లేదని వాహనాదారులు వాపోతున్నారు. సంబంధిత అధికారులకు వినతులు ఇస్తే నిధులు మంజూరై మూడేళ్లు గడుస్తున్నాయని చెబుతున్నారే తప్ప పనులు మాత్రం ముందుకు కదలడం లేదు. ఇటీవల నెల రోజుల క్రితం గుంతలు పడి కంకర తేలిన రోడ్డుపై ఉన్న బీటీని తొలగించి వదిలేశారు. దీంతో దుమ్ము, ధూళితో ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోనేవారే లేరని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ద్విచక్రవాహనాదారులు రాత్రి వేళ వెళ్లేందుకు నరకయాతన పడుతున్నారు. బీటీ తొలగించడంతో దుమ్ము, ధూళి వ్యాప్తి చెంది ఎదురుగా వస్తున్న వాహనం కన్పించక ప్రమాదాలు సంభవిస్తున్నాయని వాహనాదారులు భీతిల్లుతున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



కంకర తేలిన రహదారిపై వాహనాల రాకపోకలు

కార్యకర్తలకు అండగా నేతల చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

దోమ: పేదలకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని ఆ పార్టీ నేతలు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బొంపల్లి గ్రామానికి చెందిన ముద్దం శ్రీనివాస్, గాజుల చోటు ఇటీవలే అనారోగ్యానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న స్థానిక కాంగ్రెస్ నేతలు వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఒక్కొక్క బాధితుడికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేల చొప్పున నగదు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందన్నారు. గ్రామంలో పేదలకు ఎలాంటి కష్టాలు ఎదురైన కార్యకర్తల దృష్టికి తీసుకువస్తే వారిని ఆదుకునేందుకు ముందుంటామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి సాధిస్తుందని, ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలను అందించేలా అనునిత్యం కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సురేశ్, పార్టీ నేతలు అంతిరెడ్డి, మల్లారెడ్డి, చంద్రశేఖర్, రాములు, బాల్‌రాజ్, భాస్కర్, రమేశ్, బషీర్, ప్రభాకర్, హన్మయ్య, హైమద్, నర్సింహులు, వెంకటయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకే అత్యధిక ఎంపీ స్థానాలు

పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రహ్లాదరావు



కుల్కచర్ల: రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ అభ్యర్థులు అత్యధిక స్థానాల్లో గెలవనున్నారని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాదరావు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత ఎంపీ ఎన్నికల్లో గతంలో కంటే రెట్టింపు శాతాన్ని బీజేపీ నమోదు చేయనుందన్నారు. అత్యధిక స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంటుందన్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థుల విజయంలో విశేషమైన పాత్రను పోషించిన కార్యకర్తలకు అభినందనలు తెలిపారు.

కాంగ్రెస్ గెలుపు ఖాయం

పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్



మర్పల్లి: చేవెళ్లలో రంజిత్‌రెడ్డి విజయం ఖాయమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో జరిగిన పోలింగ్ సరళిని పరిశీలించగా కాంగ్రెస్ పార్టీ వైపే ఓటర్లు మొగ్గు చూపారన్నారు. మండలం నుంచి కాంగ్రెస్‌కు అధిక్యం వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ఫలితాలు రాగానే సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన రూ.రెండు లక్షల రుణమాఫీ ప్రక్రియ ఆగష్టు 15లోపు ప్రారంభించనున్నట్లు చెప్పారు. గత నెల రోజులుగా ఎంపీ రంజిత్‌రెడ్డి విజయం కోసం పాటు పడ్డ నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

పది ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

షాద్‌నగర్: పదో తరగతి సీబీఎస్ఈ ఫలితాల్లో పట్టణంలోని ఠాగూర్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల కరెస్పాండెంట్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. 13 మంది విద్యార్థులు 90శాతానికిపైగా, 29 మంది విద్యార్థులు 80 నుంచి 90 శాతం మార్కులు సాధించినట్లు తెలిపారు. మనీశ్ 500 మార్కులకు గాను 477 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచినట్లు తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రతిఒక్కరూ దైవభక్తిని అలవర్చుకోవాలి

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



ఎన్కేపల్లిలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పూడూరు: ప్రతి ఒక్కరూ దైవభక్తిని కలిగి ఉండాలని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఎన్కేపల్లి, రేగడిమామిడిపల్లి గ్రామాల్లో మైసమ్మ, రేణుక ఎల్లమ్మ ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు కడుమూరు ఆనందం, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, పెంటయ్య, శ్రీనివాస్, వేణుగోపాల్, రాములు, నర్సింహారెడ్డి, బాలమణి, మైపాల్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కృషి ఎనలేనిది

బీజేపీ మండల అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి



కార్యకర్తలతో రామేశ్వర్‌రెడ్డి, విశ్వజిత్‌రెడ్డి

మర్పల్లి: కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విజయం కోసం కష్టపడ్డ కార్యకర్తలకు ఆ పార్టీ మండల అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి, కొండా తనయుడు విశ్వజిత్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లేశ్‌యాదవ్ ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం మర్పల్లిలో విలేకర్లతో వారు మాట్లాడారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల నుంచి పార్టీ ఆదేశాల మేరకు మండలంలో ఏర్పాటు చేసిన ప్రచార కార్యక్రమాలకు కార్యకర్తలు ఎంతగానో శ్రమించారని గుర్తు చేశారు. సోమవారం జరిగిన ఎన్నికల సరళిని చూస్తే మండలం నుంచి బీజేపీకి ఇతర పార్టీల కన్న రెండు వేల ఓట్లు అధిక్యం రానున్నారని వారు ధీమా వ్యక్తం చేశారు. విశ్వేశ్వర్‌రెడ్డి రెండు లక్షల ఓట్ల మెజార్టీతో విజయం సాధించి చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. సమావేశంలో నాయకులు లక్ష్మణ్, శ్రీధర్ రెడ్డి, మధుకర్, శ్రీమంత్‌కుమార్, రాకేష్, బాలయ్య తదితరులు ఉన్నారు.

కొడంగల్‌లో 70.14 శాతం పోలింగ్

కొడంగల్: జిల్లా వ్యాప్తంగా జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధికంగా పోలింగ్ శాతం కొడంగల్‌లో నమోదైనట్లు కలెక్టర్ నారాయణరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరిగిలో 65.18 శాతం, వికారాబాద్‌లో 69.44 శాతం, తాండూరులో 67.34 శాతం, కొడంగల్‌లో 70.14 శాతం ఓట్లు పోలయ్యాయి. వికారాబాద్, తాండూరు, పరిగి నియోజకవర్గాలు చేవేళ్ల పార్లమెంట్ పరిధిలోకి రాగా కొడంగల్ మాత్రం మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోకి వస్తుంది.

తాండూరులో 67 శాతం

తాండూరు రూరల్: చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని తాండూరు నియోజకవర్గంలో 67.34 శాతం ఓటింగ్ నమోదైనట్లు ఆర్డీఓ శ్రీనివాస్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాండూరు పట్టణం, గ్రామీణం కలిపి 1,16,447 ఓటర్లకు గాను 72,686 ఓట్లు పోలయ్యాయి. అలాగే పెద్దేముల్ మండలంలో 39,906 ఓట్లకు గాను 30,135 ఓట్లు, యాలాలలో 40,483 ఓట్లకు గాను 29,352 ఓట్లు, బషీరాబాద్‌లో 40,235 ఓట్లకు గాను 27,062 ఓట్లు, కోట్‌పల్లిలో 6,121 ఓట్లకు గాను 4,524 ఓట్లు పోలయ్యాయని తెలిపారు.

ధారూరులో 75.43 శాతం

ధారూరు: మండలంలోని 47 పోలింగ్ బూతుల్లో సోమవారం జరిగిన పోలింగ్‌లో 75.43 శాతం ఓట్లు పోలయ్యాయి. మండలంలో మొత్తం 35,583 ఓటర్లు ఉండగా 26,848 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 10,754, స్త్రీలు 8,302 మంది ఉన్నారు. అల్లిపూర్, నాగసముందర్ గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించాయి. టెక్నీషియన్లు వీటిని సరిచేసి పోలింగ్‌ను కొనసాగించారు. కాగా బీజేపీ శ్రేణులు మంగళవారం దోర్నాల్‌లో సమావేశమై ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విక్టరీ ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

మురుగు పారి.. దుర్గంధం దరిచేరి



రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

పరిగి: పట్టణ కేంద్రంలో మురుగు నీరు ఏరులై పారుతుంది. గంజిరోడ్డులో మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడంతో నీరు రోడ్డుపైకి వ్యాపిస్తోంది. దీంతో చుట్టు పక్కల ప్రజలకు దుర్వాసన వస్తోంది. గంజిరోడ్డులో అన్ని రకాల వ్యాపార సముదాయాలు ఉండటంతో నిత్యం ప్రజలు ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి వస్తుంటారు. పట్టణ కేంద్రానికి పలు పనుల కోసం వచ్చిన వారు కూడా ఈ మురుగుతో ఇబ్బందులు పడుతున్నారు. కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి మురుగు కాలువను బాగు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

బీజేపీదే అఖండ విజయం

పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్‌కుమార్



మాట్లాడుతున్న రమేష్‌కుమార్

తాండూరు రూరల్: చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపును ఆపలేరని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం తాండూరు పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కష్టపడిన కార్యకర్తలకు ధన్యవదాలు తెలిపారు. జూన్ 4వ తేదీ ఫలితాల్లో కచ్చితంగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వృథా నీటిని స్కూల్‌లోకి రానీయొద్దు



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: కమ్మదనం గురుకుల పాఠశాలలోకి మిషన్ భగీరథ వృథా నీటిని రానీయకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధికారులకు సూచించారు. మండల పరిధిలోని కమ్మదనం గ్రామ శివారులో ఉన్న బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విద్యుల్లత పాఠశాలలోకి వస్తున్న మిషన్ భగీరథ వృథా నీటి విషయంపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే గురుకుల పాఠశాల, మిషన్ భగీరథ ప్లాంట్‌ను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మిషన్ భగీరథ పథకంలో భాగంగా నీటిని శుద్ధి చేసిన తర్వాత వచ్చే వృథా నీరు గురుకుల పాఠశాలలోకి వెళ్తుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు వెంటనే స్పందించి పాఠశాలలోని నీరు వెళ్లకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. వృథా నీటిని వన్యప్రాణులకు ఉపయోగపడే విధంగా పక్కనే ఉన్న అటవీ ప్రాంతంలోకి వెళ్లేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అధికారులు వృథా నీటిని దారి మళ్లించేలా వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈ నాగేశ్వర్ రావు, డీఈ సందీప్, ఏఈ రూప, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బాబర్‌ఖాన్, ఎంపీటీసీ అరుణ, అంజయ్యగౌడ్, దేవగిరి నవీన్, అశోక్, చందు, రాజు, రాఘవేందర్, శ్రీశైలం, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

లక్షలు వెచ్చించి.. వృథాగా వదిలేసి!

- నిరుపయోగంగా పల్లె దవాఖానా
- ఏడాది క్రితమే భవన నిర్మాణం పూర్తి
- కరెంటు కనెక్షన్ లేదనే సాకుతో ప్రారంభించని వైనం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



నిరుపయోగంగా ఉన్న పల్లె దవాఖాన భవనం

మొయినాబాద్: ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని పల్లె దవాఖానాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇందులో భాగంగా రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన భవనం ప్రారంభానికి నోచుకోకపోవడంతో అలంకారప్రాయంగా మారింది. భవన నిర్మాణం పూర్తయి ఏడాది దాటినా కరెంటు కనెక్షన్ ఇవ్వడం లేదనే సాకుతో అధికారులు నిర్లక్ష్యంతో దాటవేస్తూ వస్తున్నారు. దీంతో సంవత్సర కాలంగా ఆ భవనాన్ని నిరుపయోగంగా వదిలేశారు. అధికారులు స్పందించి భవనాన్ని త్వరగా ప్రారంభించి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

రూ.10 లక్షలు వెచ్చించినా..

మండల పరిధిలోని చిలుకూరులో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం ఉంది. కొన్నేళ్లుగా గ్రామ పంచాయతీ కార్యాలయం పక్కన ఓ చిన్న గదిలో సబ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. అయితే రెండేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం సబ్‌సెంటర్‌కు కొత్త భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసింది. చిలుకూరు బస్టాప్ పక్కనే విశాలమైన ప్రదేశంలో రూ.10లక్షలతో సబ్‌సెంటర్ భవన నిర్మాణాన్ని చేపట్టారు. భవన నిర్మాణం పూర్తయి దాదాపు ఏడాది పూర్తయింది. కానీ ఇప్పటివరకు దానిని ప్రారంభించడం లేదు.

నిర్మాణం పూర్తయినా..

చిలుకూరులో పల్లె దవాఖాన పేరుతో నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రం భవనానికి కరెంటు కనెక్షన్ ఇవ్వడం లేదని.. అందుకు అవసరమైన నిధులు ప్రభుత్వం నుంచి మంజూరు కావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. భవన నిర్మాణం పూర్తయినా అందులో కరెంటు ఫిట్టింగ్ జరగలేదు. ఈ కారణంగానే భవనాన్ని ప్రారంభించలేకపోతున్నట్లు పేర్కొంటున్నారు. అయితే ఆరునెలల క్రితం జిల్లా వైద్యాధికారి ఆ భవనాన్ని పరిశీలించారు. మిగిలిన పనులను వెంటనే పూర్తి చేయించి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. కానీ ఇంతవరకు దానిని పట్టించుకోలేదు. దీంతో రూ.లక్షలు ఖర్చుపెట్టి నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రం ప్రారంభానికి నోచుకోకుండా.. ప్రజలకు అందుబాటులోకి రాకుండా ఉంది. ఇప్పుడు రాష్ట్రంలో ఏర్పాటైన కొత్త ప్రభుత్వమైనా దీన్ని పట్టించుకుంటుందా అని స్థానికులు అంటున్నారు. ఈ విషయంపై మండల వైద్యాధికారిణి వాణిని వివరణ కోరగా.. మొయినాబాద్ చిలుకూరులో నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రం భవనం దాదాపుగా పూర్తయింది. కానీ కాంట్రాక్టర్ భవనాన్ని మాకు అప్పగించలేదు. కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయంటున్నారు. అవి పూర్తిచేసి మాకు అప్పగిస్తే అందులోనే ఆరోగ్య ఉపకేంద్రాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు.